

గో మహా పాదయాత్ర

మాతా దేవికా కంకాల గో మహా పాదయాత్ర సైనిక్‌పురి నుంచి గురువారం ఛత్రపతి శివాజీ యువ సేన కార్యాలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో బైలూర్ యోగిష్ ప్రభు, ప్రవీణ్ దూబే, మహేష్ ఎస్‌టీ చానల్, గురు బాలకృష్ణస్వామి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు. ఇక్కడ గోమాతకు పూజల అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ నుంచి పటాన్‌చెరుకు చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. – కూకట్‌పల్లి

కాంగ్రెస్‌లో చేరిన వేముల సత్యం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వేముల సత్యం

మోతీనగర్: వైఎస్‌ఆర్‌టీపీ సీనియర్ నాయకుడు వేముల సత్యం గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానంద నగర్‌కు చెందిన వేముల సత్యం గతంలో నాటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉన్న సత్సంబంధాలతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వేముల సత్యం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ... ఇటీవల జరుగుతున్న రాజకీయ మార్పుల కారణంగా కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. గతంలో పలు పార్టీల్లో పనిచేసిన అనుభవంతో కాంగ్రెస్ పార్టీలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. పార్టీ అధిష్టానం ఏ పనిచెప్పినా అకుంఠిత దీక్షతో చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

ప్రధాని మోదీ 'రోడ్ షో'కు పెద్ద ఎత్తున తరలిరావాలి

కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరం కాంతారావు, నాయకులు

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 15వ తేదిన ప్రధాని నరేంద్ర మోడీ రోడ్ షో సందర్భంగా కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీకర్ రావు అధ్యక్షతన సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 15న మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని మిర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి క్రాస్ రోడ్డు వరకు నిర్వహించే రోడ్డు షోలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు కోసం తమ శాయశక్తులా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి దేశబత్తుల సుధా, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు అనంత నాగరాజు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడ వినోద్ కుమార్ గౌడ్, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు పిట్ల మనోహర్‌తో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్వలాభం కోసం పార్టీలు మారే వారికి ఏం చెబుతాం

కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు



కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్ అర్బన్ జిల్లాకు బీజేపీ అధ్యక్షుడిగా వ్యవహరించిన పన్నాల హరీష్‌రెడ్డి గత వారం తన పదవికి రాజీనామా చేయటం జిల్లా పార్టీ శ్రేణులను అసహనానికి గురి చేసింది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా బీజేపీ నాయకులు, కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర శాఖ హరీష్‌రెడ్డికి రెండు పర్యాయాలు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పచెబితే జిల్లా రథసారథిగా, దిక్సూచిగా భావించిన పార్టీ కార్యకర్తలను లెక్క చేయకుండా.. కార్యకర్తల మనోభావాలు పరిగణనలోకి తీసుకోకుండా.. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాజీనామా చేయటం సరైనది కాదని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఖరారైన ప్రస్తుత తరుణంలో ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాల్సిన తరుణంలో హరీష్‌రెడ్డి అనైతిక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నైతిక విలువలు లేకుండా వ్యక్తిగత స్వలాభం కోసం పార్టీలు మారే వారికి ఏమి చెబుతామన్నారు. ఇలాంటి నాయకులు భవిష్యత్‌లో మరోసారి బీజేపీ పార్టీలో కనిపిస్తే బీజేపీ కార్యకర్తల ఆగ్రహావేశాలకు గురికావాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు.

కిడ్నీ రోగులకు కుటుంబ సహకారం అవసరం



ప్రపంచ కిడ్నీ దినోత్సవంలో పాల్గొన్న రామ్‌దేవ్‌రావు వైద్యులు, సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: రామ్‌దేవ్ రావు ఆస్పత్రిలో వైద్యులు, రోగులు, సిబ్బందితో కలిసి ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని డాక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌దేవ్‌రావు గైనిక్ హెడ్ డాక్టర్ ఛాయాదేవి మాట్లాడుతూ... ఈ కిడ్నీ రోగులు ముందుగా జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు రాకుండా ఉంటాయని తెలిపారు. డైటీషియన్ అఖిల మాట్లాడుతూ.. కిడ్నీ రోగులు ఎటువంటి డైట్ తీసుకోవాలో వివరించారు. టీమ్ మెంబర్ గ్లోరి ఎవాంజలిన్, సంజన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. సీఈఓ డాక్టర్ యోబు మాట్లాడుతూ.. కిడ్నీ రోగులకు కుటుంబ సభ్యుల సహకారం చాలా అవసరమన్నారు. వారి సహకారంతోనే డయాలసిస్ పేషెంట్స్ మనుగడ సాగించగలుగుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో అఖిల, శోభ, వైద్యులు రంగనాథ్, లావణ్య, రాఘవేంద్ర, ఎబెల్, కృష్ణ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

భౌ భౌ

దాడులకు పాల్పడుతున్న గ్రామ సింహాలు







అల్లాపూర్, మూసాపేట డివిజన్‌లలోని పలు కాలనీల్లో సంచరిస్తున్న వీధి కుక్కలు

మోతీనగర్: గ్రామ సింహాల (వీధి కుక్కల) హడావుడి అంతా ఇంతా కాదు. ఉదయం తెల్లవారుజామునుంచే రోడ్లపై తిరుగుతూ వాక్లర్లు, పేపర్‌బాయ్స్, పాల ప్యాకెట్స్ అందించే వారిపై గ్రామ సింహాలు దాడులు చేస్తున్నాయి.

◆ మూసాపేట డివిజన్‌లోని మోతీనగర్, పాండురంగానగర్, కబీర్‌నగర్, స్నేహపురి కాలనీ, బాలాజీ స్వర్ణపురి కాలనీతో పాటు పలు బస్తీ, కాలనీల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా తయారైంది. అదే విధంగా అల్లాపూర్‌లోని వి. రామరావునగర్, న్యూ రామారావు నగర్, శివబస్తీ, శివాజీనగర్, రాధాకృష్ణనగర్, రాజీవ్ గాంధీనగర్, యూసుఫ్ నగర్‌లలో గ్రామ శివారులో ప్రజలపై దాడులు చేస్త తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

◆ బస్తీ కాలనీల్లో ఉన్న మటన్ షాపుల వద్ద హోటల్‌లో మాంస వ్యర్థాలను పడవేయటంతో కుక్కలు గుంపులు, గుంపులుగా చేరి మనుషులపై దాడులు చేస్తున్నాయి. అంతేకాకుండా ఉదయం వేళల్లో వాకింగ్‌కు వెళ్లే వృద్ధులు, పిల్లలు, యువకులపై కూడా దాడులకు దిగుతున్నాయి. గతంలో సంబంధిత అధికారులు వీధి కుక్కలను తీసుకువెళ్లి సుదూర ప్రాంతాల్లో వదలిపెట్టేవారు.

◆ అలా కాకుండా ప్రస్తుతం సంబంధిత అధికారులు గ్రామ సింహాలను తీసుకుని వెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లను చేసి అదే ప్రాంతంలో వదిలి పెడుతున్నారు. దీంతో కుక్కలు గుంపులు గుంపులుగా పెరిగి దాడులు చేస్తున్నాయి. రాత్రి అయిందంటే వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయి. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

◆ ఇప్పటికైనా సంబంధిత అధికారులు బస్తీ, కాలనీల్లో బహిరంగంగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్న గ్రామ సింహాల హడావుడిని శాశ్వతంగా అరికట్టాలి. ముఖ్యంగా వేసవి కాలంలో గ్రామ సింహాలు విపరీతంగా దాడులకు పాల్పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామ సింహాల ఆగడాలను అరికట్టాలి.



గృహ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించాలి

పంజగుట్ట: గృహకార్మికుల, గార్బేజ్ కలెక్టర్లకు ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వీరిని గుర్తించి ఆదుకోవాలని ఆయన కోరారు. మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్ట్యూట్, గృహకార్మికుల యూనియన్ తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ గార్బేజ్ కలెక్టర్‌స కలెక్టివ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... సమాజంలో ఎంతో అవసరమైన వృత్తిలో కొనసాగుతున్న వీరికి కనీసం గౌరవం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నాల్గో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలి

హిమాయత్‌నగర్: వేతన సవరణలో (పీఆర్‌సీ) నాలుగో తరగతి ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం వేతన సవరణ సంఘాన్ని కోరింది. పెరిగిన ధరలు, జీవన వ్యయం దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వేతన సవరణ సంఘం నాలుగో తరగతి ఉద్యోగులకు బేసిక్ పే రూ. 35 వేలు ఉండేటట్లు చూడాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తదితరుల నేతృత్వంలో ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి నాలుగో తరగతి ఉద్యోగుల ప్రతిపాదనలు అందచేశారు. నాలుగో తరగతి ఉద్యోగులకు 51 శాతం ఫిట్ మెంట్ ప్రకటించాలని, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ పెంచాలని విన్నవించారు.

కార్పొరేషన్ల ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

హిమాయత్‌నగర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు అన్ని కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపు 6 గ్యారంటీల అమలు జరుగుతుందని, ప్రజలకిచ్చిన హామీల అమలుతో పాటు అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజయవంతంగా ముందుకు తీసుకువెళ్తున్నారని తెలిపారు. బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాల మంజూరుతో పాటు కల్యాణ లక్ష్మి పథకంలో ఉచితంగా తులం బంగారం, ప్రజాపాలన అభయహస్తం, అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డుల మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని భంగం చేయకుండా, ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తూ, ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ పాలన కొనసాగిస్తుందని శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



మూసాపేట: మూసాపేట ప్రగతినగర్ కమ్యూనిటీహాల్‌లో గురువారం శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పాటలు పాడుతూ... నాటికలు వేస్తూ.. సినిమా, దేశభక్తి, జానపద గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ అలకరించారు. చక్ దే ఇండియా అంటూ దేశ భక్తి పాటలకు లుంగీ డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గార్లపాటి సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం ఉండాలన్నారు. తమ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి వేదికలు వారిలో ప్రతిభను వెలికితీస్తాయని అన్నారు.

చెరువు సుందరీకరణ, సంరక్షణ పనులు చేపట్టాం



ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనుల్లో భాగంగా 2 కోట్ల 74 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న మురుగునీటి మళ్లింపు పైపు లైన్ నిర్మాణ పనులను గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువులు కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజీ వ్యవస్థ, మళ్లింపు పనులను త్వరగా పూర్తి చేయాలని, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఎక్కడా రాజీ పడకూడదని పేర్కొన్నారు.

◆ చుట్టు పక్కల కాలనీల నుంచి వచ్చే మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులో మురుగునీరు కలవకుండా సస్యశామలంగా, ఆహ్లాదకరంగా చెరువును పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. చెరువు సుందరీకరణలో భాగంగా చెరువు కట్ట పటిష్ట పరిచేలా పునరుద్ధరణ, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగునీటి మళ్లింపు పైపులైన్ నిర్మాణం, అలుగు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడతామని తెలిపారు. గుర్రపు డెక్క వల్ల దోమలు పెరగటం వల్ల స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఈ ఇబ్బందులను పరిష్కరించటానికి చెరువును దత్తత తీసుకొని సొంత నిధులతో చెరువును శుభ్రపరిచి సుందరీకరణ చేయనున్నట్లు వివరించారు.



మర్యాదపూర్వక కలయిక

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ, అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌లను గురువారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొప్పిశెట్టి దినేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా తయారు చేసి, ప్రభుత్వ పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని వేం నరేందర్‌రెడ్డి సూచించారు.

యూజీడీ పైపులైన్ పనులను త్వరలో ప్రారంభిస్తాం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీలోని ప్రతి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నానని సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం బస్తీలోని రోడ్ నం.3, 6లలో నూతనంగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనుల కోసం సంబంధిత విభాగం అధికారులు పంపించిన పైపులను ఆయన అందుకున్నారు. వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తీలోని ప్రతి సమస్యను స్థానిక, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వతంగా పరిష్కిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో బస్తీ నేత యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ పరిధిలోని వాంబే కాలనీలో బ్లాక్ నెంబర్ 29లో నివాసితురాల గంగమణి అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ గురువారం ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఆ కార్యక్రమంలో ఎత్తరి శ్రీను, బి.రాము, పి.రాజు మున్నూరు, శ్రీతల తదితరులు పాల్గొన్నారు.

'పోతన భాగవతం-అలంకార శిల్పం' ఆవిష్కరణ

రాయదుర్గం: అలంకారశాస్త్రంపై పరిమితంగా పరిశోధనలు జరుగుతున్నాయని హెచ్‌సీయూ ఆచార్య పిల్లలమర్రి రాములు పేర్కొన్నారు. ఈ కాలంలో పోతన రాసిన మహా భాగవతంలో అలంకార శిల్పం గురించి పరిశోధన చేయడం ఎంతో విశేషంగా ఆయన అభివర్ణించారు. గురువారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయులోని తెలుగుశాఖ కార్యాలయంలో పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ గొట్టే శ్రీనివాస్‌రావు తన పరిశోధనా గ్రంథం 'పోతన భాగవతం-అలంకారశిల్పం'ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పిల్లల మర్రి రాములు మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు తమ పరిశోధనా అంశం ఎంపికలో పలు జాగ్రత్తలు తీసుకుంటే భవిష్యత్తులో వాటి ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహా కావ్యమైన ఆంధ్ర మహా భాగవతంపై పరిశోధన చేయడం ఒక విశేషమన్నారు. అయితే దానిలోని అలంకారాలపై సమగ్రంగా అధ్యయనం చేయడం అత్యంత ప్రశంసనీయమన్నారు. ఆచార్య పిల్లలమర్రి రాములు వద్ద ఇప్పటి వరకు 30 మంది పీహెచ్‌డీలు, 40 మంది ఎంఫిల్ పరిశోధనలు జరిగినప్పటికీ ఇదే ప్రచురితమైన తొలి పీహెచ్‌డీ గ్రంథం కావడం మరో విశేషమన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ గొట్టే శ్రీనివాసరావు మాట్లాడుతూ తాను చదువుకొని పరిశోధన చేసిన తెలుగుశాఖలోనే తన గ్రంథం ఆవిష్కరణ కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

హాస్టల్ గదుల్లోకి పోలీసుల రాకను నియంత్రించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని హాస్టల్ గదుల్లోకి పోలీసుల రాకను నియంత్రించాలని ఏఐఎస్‌ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. గురువారం ఉస్మానియా ఫౌండేషన్ భవన్ భూమి పూజలకు వచ్చే పూర్వవిద్యార్థులతో మాట్లాడాలన్నారు. చివరికి పోలీసుల వాహనంలోనే శంకుస్థాపన కార్యక్రమం వద్దకు తీసుకొచ్చారని తెలిపారు. ఓయూలో పెంచిన ఫీజుల విషయమై వీసీ ప్రొ.రవీందర్‌ను అడగాలని పూర్వవిద్యార్థులను విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు కాకుండా సదస్సులు, సంబరాలు, సన్మానాలు తదితర కార్యక్రమాలతో అల్యూమి అసోసియేషన్ నాయకులు కాలక్షేపం చేస్తున్నారని పూర్వ విద్యార్థులకు వివరించారు. ఉస్మానియా ఫౌండేషన్ ద్వారా సేకరించిన నిధులలో ఓయూలో ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్న పేద విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందచేయాలని కోరినట్లు నెల్లి సత్య తెలిపారు.

'కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన భూమిని తిరిగి అప్పగించాలి'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం 1991లో తమకు కేటాయించిన 189.11 ఎకరాల భూమిని 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమంగా వెనక్కి తీసుకుందని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో తిరిగి తమ భూమిని అప్పగించాలని తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ మహిళా వింగ్ చైర్మన్ జి.సూర్యకళ, కోచైర్మన్ ఝాన్సీరాణి, కన్వీనర్ ఝాన్సీలక్ష్మీబాయి డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జంట నగరాల్లోని హెచ్‌ఓడీలలో పని చేసే నాలుగు ప్రధాన ఉద్యోగ సంఘాలలో సభ్యులుగా ఉన్న ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో భూమిని కేటాయిస్తూ జీఓ నంబర్ 589 రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ద్వారా జారీ చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

పటాన్‌చెరు: ప్రశ్నించేతత్వం అలవర్చుకున్నప్పుడే ప్రతి మనిషి సంపూర్ణ వినియోగదారుడు అవుతాడని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు విజయ్‌కుమార్ అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వినియోగదారి హక్కుల దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషన్ సభ్యులు విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. హక్కులు, బాధ్యతలు నాణానికి రెండు వైపులా ఉంటాయని, బాధ్యతలను నిర్వర్తించే వాడే హక్కులను పొందగలుగుతాడని వివరించారు. అనంతరం ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రముఖ న్యాయవాది డాక్టర్ కూన వేణు మాట్లాడుతూ... మోసపూరిత వ్యాపార ప్రకటనలు,అంతర్జాలంలో ఉండే బెట్టింగ్ యాప్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు.విశిష్ఠ అతిథిగా పాల్గొన్న వంశీప్రియ రెడ్డి అక్షరాస్యత ఉన్న, సమయాభావం వలన వినియోగదారుడు తన హక్కులను పరిరక్షించుకోలేకపోతున్నారన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

మూసాపేట: ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన పరీక్షలు బుధవారం మొదటి సంవత్సరం, గురువారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. చివరి రోజు కావటంతో విద్యార్థులు ఆనందంలో కేరింతలు కొడుతూ.. పేపర్లు చింపుతూ.. సరదాగా కనిపించారు. స్నేహితులకు బాయ్ చెబుతూ వేసవి సెలవులు ముగిసిన తరువాత కలుసుకుందామని వీడ్కోలు పలుకుతూ కన్పించారు. హాస్టల్ విద్యార్థులు ఖాళీ చేసి బ్యాగులు సర్దుకొని ఊళ్లకు వెళ్లారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వేసవి సెలవులను ఉన్నత చదువులకు ఉపయోగపడే విధంగా కంప్యూటర్ కోర్సు, టైపింగ్, ఎంసెట్‌లకు సిద్ధం అవుతున్నారు.





ఎంసెట్‌కు ప్రిపేర్ అవ్వాలి...



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాను. అమ్మమ్మ వాళ్ల ఇంటికి ఆంధ్ర ప్రదేశ్‌కు వెళ్లాలి. వేసవి సెలవులు ఎంజాయ్ బాగా చేస్తాం. కొన్ని రోజులు వెళ్లి వచ్చిన తరువా ఎంసెట్‌కు ప్రిపేర్ అవ్వాలి.

– పావనీ, సెకండియర్

కోచింగ్ తీసుకుంటా...



వేసవి సెలవులు తరువాత కోచింగ్ సెంటర్‌కు వెళ్లాలి. బైపీసీ అయిపోయింది. మెడికల్ సీట్ వచ్చేలా కోచింగ్ తీసుకుంటాను. అప్పటి వరకు కొన్ని రోజులు ఊరెళ్లి రెస్ట్ తీసుకుంటా. ఆ తర్వాత ఎంసెట్ పరీక్షలకు ప్రిపేర్ అవుతా.

– ధరణి, సెకండియర్

సమ్మర్ టూర్‌కు వెళ్లాలి..





ఫ్యామిలీతో కలిసి సమ్మర్ టూర్‌కు వెళ్లాలి. ఎదైనా మంచి ప్లేస్‌కు వెళ్లి, దేవాలయాలు దర్శనం చేసుకొని మళ్లీ కళాశాలకు వెళ్లాలి. ద్వితీయ సంవత్సరం ముందుగానే ప్రారంభం అవుతుంది. ఉన్న కొన్ని రోజులు కుటుంబ సభ్యులతో సరదాగా గడపాలి.

– శ్రీవల్లి, ఫస్టియర్